సాక్షి నిజామాబాద్


బుధవారం । 12 । మార్చి । 2025



అర్వింద్.. చర్చకు సిద్ధమా?

జిల్లాకు ఎంపీ అర్వింద్ చేసిందేమీ లేదని, కేంద్రం నుంచి నిధులు తీసుకు రాలేదని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.9 /18.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు సీనియర్ హాకీ జిల్లాస్థాయి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఆర్మూర్‌లోని మినీ స్టేడియంలో ఈనెల 13న నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ హాకీ జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. ఈనెల 16, 17, 18 తేదీలలో కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ లో తెలంగాణ పురుషుల అంతర్ జిల్లాల హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైన వారిని పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏప్రిల్‌లో ‘మోడల్’ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్ అర్బన్: మోడల్ స్కూళ్లల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్షను ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదివరకే మోడల్ స్కూళ్లల్లో అడ్మిషన్ల నిర్వహణకు షెడ్యూల్ కూడా విడుదల చేసినట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 852 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: జిల్లావ్యాప్తంగా మంగళవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బొటనీ, పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్–1ఏ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి తిరుమలపుడి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 21,218 మంది విద్యార్థులకు గాను 20,366 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. 852 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి చీటీలు రాస్తుండగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 54 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశామన్నారు.

ఓ విద్యార్థికి అనుమతి నిరాకరణ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజేత కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రానికి మంగళవారం ఓ విద్యార్థి ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతి నిరాకరించారు. నిబంధనల ప్రకారం 9:05 నిమిషాలలోపు పరీక్ష కేంద్రంలోకి చేరుకోవాల్సి ఉండగా, షేక్ ఖలీమ్ అనే ఫస్టియర్ విద్యార్థి 9:15 నిమిషాలకు చేరుకున్నాడు. దీంతో కేంద్రం వద్ద ఉన్న సిబ్బంది అతడికి అనుమతి నిరాకరించారు.

సౌత్ క్యాంపస్‌ను సందర్శించిన వీసీ



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌ను మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ యాదగిరిరావు సందర్శించారు. క్యాంపస్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. వసతి గృహాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా చూశారు. డ్రెయినేజీ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాలికలు, బాలుర హాస్టళ్లు, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు. వీసీ వెంట యూనివర్సిటీ ఏఈ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు యాలాద్రి, సునీత, మోహన్ బాబు, నాగరాజు, నారాయణ, రమాదేవి తదితరులున్నారు.

ప్రధాన వనరు ప్రాక్టీషనర్లే..!



నగరానికి చెందిన మూడు కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నందిపేట్ ఉమ్మడి మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల సుమారు 100 మందికి పైగా ఆర్ఎంపీ, పీఎంపీలకు దావత్ ఇచ్చారు. రూ.10లక్షలు ఖర్చు చేసిన వారు.. మేకలు కోసి దావత్ ఇచ్చిన తరువాత ఖరీదైన బహుమతులు అందజేశారు.

బోధన్ డివిజన్ పరిధిలోని ఓ మండలానికి చెందిన ఆర్ఎంపీ, పీఎంపీలను కార్పొరేట్ ఆస్పతుల నిర్వాహకులు ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్యాంకాక్‌కు తీసుకెళ్లారు. ఐదు రోజులపాటు కొనసాగిన ఈ టూర్ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించారు.

- ఆర్ఎంపీ, పీఎంపీలతో కలిసి జోరుగా కార్పొరేట్ వైద్య వ్యాపారం
- దావత్‌లు, ఖరీదైన బహుమతులు.. టూర్లు.. అడ్వాన్స్‌లు
- మళ్లీ జోరందుకున్న రిఫరల్ దందా



నిజామాబాద్‌నాగారం: వైద్యాన్ని వ్యాపారంగా మార్చిన ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఆర్ఎంపీలు, పీఎంపీలపై భారీ పెట్టుబడులు పెడుతున్నారు. గ్రామీణ ప్రజల ‘నాడి’ తెలిసిన ప్రాక్టీషనర్లను తమ వ్యాపారానికి ప్రధాన వనరుగా మార్చుకుంటున్నారు. జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీ యూనియన్లు నాలుగు ఉండగా సుమారు 3వేల మంది సభ్యులుగా ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంపౌండర్లుగా పనిచేసిన చాలా మంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రాక్టీషనర్లుగా పని చేస్తున్నారు. తమ అర్హతను మించి వైద్యం చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పేరుకు ప్రాథమిక చికిత్స కేంద్రాలే అయినా కొందరు ఆపరేషన్ల చేసే వరకు వెళ్తుండడం గమనార్హం. అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రాక్టీషనర్లను తమతో కలుపుకుంటున్న కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు వారికి కమీషన్లు, దావత్‌లు ఇవ్వడంతోపా టు టూర్లకు తీ సుకెళ్తున్నారు.

- ✤ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు జిల్లాలో గతేడాది నవంబర్ 28, 29 తేదీల్లో తనిఖీలు చేపట్టి ఎనిమిది ప్రాక్టీషనర్లపై కేసులు నమోదు చేశారు.
- ✤ కలెక్టర్ ఆదేశాల మేరకు గతేడాది జిల్లాలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పదుల సంఖ్యలో క్లినిక్‌లను సీజ్ చేశారు.
- ✤ ఓ యువతికి అబార్షన్ మాత్రలను రిఫర్ చేసి ఆమె మృతికి కారణమైన ఆర్ఎంపీపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

బర్త్ డేలు, మ్యారేజ్ డేలు

రోగులను రిఫర్ చేస్తున్న ప్రాక్టీషనర్ల కుటుంబంలో బర్త్ డేలు, మ్యారేజ్ డేలనూ కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వారిళ్లలో జరుపుకునే పూజల ఖర్చును సైతం భరించడం, బంగారాన్ని కానుకల రూపంలో ఇవ్వడం మామూలు విషయంగా మారింది.

గోవా.. బ్యాంకాక్.. హాంకాంగ్

మూడు, ఆరు నెలలకోసారి ఆర్ఎంపీ,పీఎంపీలను ఎంజాయ్ చేయడానికి బ్యాంకాక్, గోవా, హాంకాంగ్‌కు తీసుకెళ్తున్నారు. ఐదు రోజులపాటు కొనసాగనున్న ట్రిప్పులకు బ్యాచ్‌లవారీగా పంపిస్తున్నారు. అక్కడ ఎంజాయ్ చేసి రిఫ్రెష్ అయి వస్తున్న ప్రాక్టీషనర్లు ఉత్సాహంగా రిఫరల్ దందా జోరు పెంచుతున్నారు.

చర్యలు లేకపోవడంతో..

తనిఖీలతో హడలెత్తించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారుల జాడ గత కొన్ని నెలలుగా లేకపోవడం, కేసు లు నమోదైన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రాక్టీషనర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలలుగా తనిఖీలు లేకపో వడంతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

రెండు, మూడు మండలాలకు కలిపి..

గ్రామాలు, యూనియన్‌ల వారీగా రెండు మూడు మండలాలకు కలిపి ఆర్ఎంపీ, పీఎంపీలకు కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు పెద్ద ఎత్తున దావత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా బహుమతులు ఇవ్వడంతోపాటు బిల్లుల్లో కమీషన్ కాకుండా కొంత మందికి రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకు అడ్వాన్సులుగా ఇస్తుండడం గమనార్హం. ఇంకే ముంది అమాయకుల నుంచి వైద్యం పేరిట లక్షలు కొల్లగొడుతున్నారు. ప్రాణాలు కోల్పోయిన రోగులకు సంబంధించిన బిల్లుల్లోనూ ప్రాక్టీషనర్లు 40 నుంచి 50శాతం కమీషన్లు తీసుకుంటుండడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

గ్రూప్స్‌లో మనోళ్ల ప్రతిభ

- గ్రూప్–2లో కమ్మర్‌పల్లి వాసికి ఐదో ర్యాంక్
- గ్రూప్–1లో ఉత్తమ మార్కులు సాధించిన జిల్లావాసులు



ఆనంద్ కుమార్ (5వ ర్యాంక్ - బీసీ సీ)



దొండ రామ్‌కిశోర్ (136వ ర్యాంక్)

నిజామాబాద్‌నాగారం: గ్రూప్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు సత్తాచాటారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన మాదరి ఆనంద్‌కుమార్ రాష్ట్రస్థాయి(బీసీ – సీ)లో ఐదో ర్యాంకు సాధించ గా, ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన రామ్‌కిశోర్ 136వ ర్యాంక్ సాధించారు. ఐదో ర్యాంకు సాధించిన ఆనంద్‌కుమార్ సచివాలయంలో లేదా కో ఆపరేటీవ్ శాఖలో రిజిస్ట్రార్‌గా ఉద్యోగం వచ్చే అవకాశాలున్నాయి.

ఢిల్లీలోని కా ర్పొరేట్ కంపెనీలో ఉద్యోగాన్ని వదులుకుని వచ్చిన ఆనంద్ గ్రూప్స్‌కు సన్నద్ధమై సక్సెస్ అయ్యారు. గతేడాది గ్రూప్–4లో సత్తాచాటి కమర్షియల్ టాక్స్‌లో ఉద్యోగం సాధించారు. తల్లి కరుణ, తండ్రి ఆనంద్, సతీమణి తేజస్విని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెర్కిట్ వాసికి 136వ ర్యాంక్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన దొండ రామ్‌కిశోర్ రాష్ట్రస్థాయిలో 136 ర్యాంకు (బాసర జోన్ పరిధిలో 9వ ర్యాంకు) సాధించాడు. గతేడాది గ్రూప్–4 ఫలితాల్లో రామ్‌కిశోర్ ప్రభుత్వ కొలువు సాధించాడు. ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు దొండ రమేశ్, లక్ష్మి దంపతుల కుమారుడు రామ్‌కిశోర్ బోధన్ విజయసాయి స్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి వరకు అభ్యసించారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. తమ కుమారుడికి గ్రూప్–2లో ఉత్తమ ర్యాంకు రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్ వన్‌లో చేంగల్‌వాసి ప్రతిభ



మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలం చేంగల్‌కు చెందిన నంబి ఆత్రేయ గ్రూప్–1లో 461.5 మార్కులు సాధించారు. ఇంజినీరింగ్ పట్టభద్రుడైన ఆత్రేయ ప్రస్తుతం చెన్నై ఎయిర్ పోర్టులో మేనేజర్‌గా విధులు పని చేస్తున్నారు. ఆత్రేయ తల్లిదండ్రులు ఉపాధ్యాయులే. లింబాద్రి గుట్ట ఆలయం వారసత్వ వేద పండితులైన నంబి వంశానికి చెందిన యువకుడికి గ్రూప్–1 ఉద్యోగం లభించడంపై ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సన్నిహితుల ప్రోత్సాహంతో సాధించా

రాజ్యాంగబద్ధంగా ప్రజా సేవ చేసేందుకు అహర్నిషలు కృషి చేస్తా. కుటుంబ సభ్యులు, సన్నిహితుల ప్రోత్సాహంతో గ్రూప్–2 సాధించా. నన్ను ఎన్నారై లు సంతోష్, రాయదాస్‌తోపాటు దేవ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ బండి గంగాధర్, హెచ్ఎం ఆనంద్ అడుగడుగునా నిర్దేశం చేస్తూ ప్రోత్సహించారు. గ్రూప్–1 సైతం వచ్చే అవకాశాలున్నాయి.

– మాదరి ఆనంద్‌కుమార్

పసుపు రైతులకు నష్టం కలగొద్దు

- అధికారులతో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- ఫోన్‌లో దిశానిర్దేశం

నిజామాబాద్ సిటీ: పసుపు రైతులకు నష్టం కల గకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో పసుపు విక్రయాలు, ఇతర అంశాలపై మంగళవారం ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంటకు గిట్టుబాటు ధరపై పసు పు బోర్డు ఎండీ భవానిశ్రీ, మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్ర మోహన్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పసుపును ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర దక్కేలా చూడాలన్నారు. ఈ నామ్ పోర్టల్ లో వచ్చే గరిష్ఠ ధరను ఆధారంగా చేసుకొని, రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

యథాతథంగా పసుపు తూకాలు

నిజామాబాద్ మార్కెట్ యార్డులో బుధ, గురువారాల్లో పసుపు తూకాలు ఎప్పటిలాగే జరుగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున పసుపు పంట నిల్వలు వచ్చినట్లు తెలిపారు. బిడ్డింగ్ కాకుండా మిగిలిన పసుపు నిల్వలకు బిడ్డింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

- కాలువల ద్వారా కొనసాగుతున్న నీరు
- గతేడాది కంటే 8టీఎంసీలు ఎక్కువగా నీటి నిల్వ



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా తగ్గుతుంది. ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌కు కాలువల ద్వారా డిసెంబర్ 25 నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. ఏప్రిల్ 25 వరకు పంటలకు నీరు అందించేలా ప్రణాళిక చేశారు. కానీ చివరి వరకు నీరు అందకపోవచ్చని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి విడుదల ప్రారంభ సమయంలో ప్రాజెక్ట్‌లో 80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం 27 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. 53 టీఎంసీల నీటి వినియోగం ఇప్పటికే జరిగింది. మరో నెలన్నర రోజులు నీటి సరాఫరా చేపట్టాలి. ఎండలు ఎక్కువగా కాస్తుండటంతో నీటి వినియోగం మరింత పెరుగుతుందని సమాచారం. అయినా ప్రాజెక్ట్ ఆయకట్టు చివరి వరకు నీరు అందుతుందని, పంటలకు ఎలాంటి డోకా లేదని ప్రాజెక్ట్ అధికారులు అంటున్నారు.

గతేడాది కంటే ఎక్కువే..

ప్రాజెక్ట్‌లో గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 19 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రస్తుత సంవత్సరం అంత కంటే 8 టీఎంసీల ఎక్కువగా అంటే 27 టీఎంసీలు నీరు ఉంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 135 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, ముంపు లిఫ్టుల ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 404 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది.

‘ఆరుతడి’పై రైతులను చైతన్యపర్చాలి

- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాలు
- సిరికొండ, ధర్పల్లి మండలాల్లో ఎండిన వరి పొలాల పరిశీలన



సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ఎండిన వరిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సిరికొండ/ధర్పల్లి: యాసంగి సీజన్‌లో భూగర్భ జలాల పరిస్థితిని రైతులకు వివరిస్తూ వరి వేయకుండా ఆరుతడి పంటలు సాగు చేసేలా చైతన్య పర్చాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ధర్పల్లి మండలంలోని చెరువు తండా, దుబ్బాక, సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ఎండిన వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. బోరుబావుల కింద సాగవుతున్న వరి పరిస్థితి, సాగునీటి లభ్యతపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. బోరు బావులపై ఆధారపడి వరి సాగు చేస్తున్నామని, భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావులు ఎత్తిపోయి పంటలు ఎండిపోతున్నాయని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో పంట ఎండిపోయే దశకు చేరింది, ఇంకా ఎన్ని తడుల నీరు అవసరం ఉంది, పంట ఎప్పటి వరకు చేతికొస్తుందని కలెక్టర్ తెలుసుకున్నారు. పంటలు ఎండకుండా సాగు నీరందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉంటే పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. డీఏవో వాజిద్ హుస్సేన్, ఏవోలు నర్సయ్య, వెంకటేశ్, తహసీల్దార్‌లు మాలతి, రవీందర్‌రావు, ధర్పల్లి ఆర్ఐ రాజేశ్వర్, సిరికొండ ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఉన్నారు.

పసుపు విక్రయాలపై పకడ్బందీ పర్యవేక్షణ

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ మార్కెట్ యార్డ్‌లో పసుపు విక్రయాలపై పకడ్బందీగా పర్యవేక్షణ చేపడుతున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పసుపు విక్రయించే క్రమంలో రైతులకు ఏ దశలోనూ నష్టం వాటిల్లకుండా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. పసుపు క్రయ, విక్రయాల నిశిత పరిశీలన కోసం సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశామని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా కృషి చేస్తారని తెలిపారు. రైతులు ఆందోళనకు గురికావొద్దని, అధికారులతోపాటు అదనపు కలెక్టర్ సైతం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. రైతులకు నష్టం వాటిల్లేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఖాకీల చుట్టూ వివాదాలు


- సివిల్ పంచాయితీలు, ఇసుక అక్రమరవాణాలో పాత్ర
- అవినీతి ఆరోపణలు, విచారణ ఎదుర్కొంటున్న పలువురు

ఖలీల్‌వాడి: కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీసు అధికారులు సివిల్ పంచాయితీల్లో ఇసుక అక్రమ రవాణాలో తలదూర్చడం వివాదా స్పదమవుతోంది. ఏళ్లుగా జిల్లాలోనే పని చేస్తున్న వారికి స్థానికులతో విస్తృత పరిచయాలు ఏర్పడి చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారని, బాధితుల ఫిర్యాదులనూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాలన గాడిలో పడేనా..

గతంలో సీపీగా పని చేసిన కల్మేశ్వర్ కేంద్ర సర్వీసులకు బదిలీపై వెళ్లగా, సుమారు నాలుగు నెలలపాటు కామారెడ్డి ఎస్పీ నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీగా పని చేశారు. రెగ్యులర్ సీపీ లేకపోవడంతో పలువురు సీఐలు, ఎస్సైలు ఠాణాల్లో ఆడిందే ఆటగా సాగిందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఎమ్మెల్యేల వరకూ ఫిర్యాదులు వెళ్లాయి. ఈ పరిస్థితుల్లో నూతన సీపీగా పోతరాజు సాయిచైతన్య సోమవారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అవినీతి ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులపై ఎలాంటి చర్యలు ఉంటాయనేది చర్చనీయాంశమైంది.

- ✤ పోక్సో కేసులో అరెస్టైన వ్యక్తి రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై జ్యుడీషియల్, డిపార్ట్‌మెంట్ విచారణ సాగుతోంది. ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.
- ✤ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఓ ఎస్సై ఇసుక వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదు అందింది. ఎస్సై కనుసన్నల్లో ఇసుక దందా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. మరో కేసులో ఓ పార్టీకి చెందిన నాయకులను చితకబాదగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.



- ✤ బోధన్ నియోజకవర్గంలో పని చేస్తున్న ఇద్దరు ఎస్సైలు ఇసుక వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని డీఐజీ దృష్టికి ఓ ప్రజాప్రతినిధి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులు మందలించడంతో సెలవులపై వెళ్లిన వారు తిరిగి విధుల్లో చేరారు.
- ✤ భార్యాభర్తల పంచాయితీలో అత్యుత్సాహం చూపిన ఆర్మూర్ డివిజన్‌లోని ఓ సీఐపై బదిలీ వేటు పడింది.
- ✤ ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆర్మూర్ డివిజన్‌లోని ఇద్దరు ఎస్సైలను ఉన్నతాధికారులు మందలించారు. ఎస్సైల కొరత కారణంగా బదిలీ వాయిదా పడింది.
- ✤ జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామంలోని భూ వివాదంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని బాధితుడు నచ్చెన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తోపాటు హైకోర్టును ఆశ్రయించారు. డిచ్‌పల్లి సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది.
- ✤ అక్రమ ఇసుక రవాణాకు సహకరించిన ఎస్సైల జాబితాను డీజీపీ సీపీకి పంపించారు. లూప్‌లైన్‌లో పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వారు యథావిధిగా పని చేస్తున్నారు.

లోకాయుక్తలో ఫిర్యాదులు

- ✤ సివిల్ పంచాయితీలో పీఎస్‌కు వచ్చిన యువతి ఫోన్ నంబర్ తీసుకున్న ఓ సీఐ ఆమెతో వాట్సాప్ చాటింగ్ చేశారు. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా, వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు తనపై తప్పుడు కేసు చేశారని ఓ యువకుడు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పోలీసులు యువకుడిని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ✤ గణేశ్ నిమజ్జనోత్సవాల్లో ఘర్షణ పడిన కొందరిని పోలీసులు పీఎస్‌కు తరలిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఎందుకు తీసుకెళ్తున్నారని పోలీసులను ప్రశ్నించగా యువకుడిపై దాడి చేసి ఏ2గా కేసు నమోదు చేశారు. గొడవతో తనకు ఏం సంబంధం లేకున్నా కేసు నమోదు చేశారని సదరు యువకుడు లోకాయుక్తకు వెళ్లాడు. ఇటీవల అదే పోలీస్‌స్టేషన్‌లో సదరు యువకుడిపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.
- ✤ ఆటోను ఆపకుండా వెళ్తున్నారని ఆగ్రహంతో బాల్కొండ నియోజకవర్గంలోని ఓ ఠాణా పోలీసులు వారిని చితకబాదారు. సదరు యువకులను విచారించగా.. ఆయిల్‌ను రీ సైక్లింగ్‌కు తీసుకెళ్తున్నారని తేలింది. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేస్తే విషయం బయటకు పొక్కుతుందని పోలీసులు భావించి వదిలేసినట్లు తెలుస్తోంది.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

బోధన్‌రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరతగతిన పరిష్కరించడమే తమ లక్ష్యమని సీజీఆర్ఎఫ్(విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) చైర్మన్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం బోధన్‌లోని బెల్లాల్ ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గృహ, వ్యాపార, వ్యవసాయ, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు నిరంతరంగా, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తు న్నామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలున్నా 8333923841, 8333923842, 8333923843 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, మద్రిపల్లి రాజాగౌడ్, బోధన్ డీఈ ఎండీ ముక్తార్, ఏడీఈ నాగేశ్ కుమార్, ఏఈలు నాయిని కృష్ణ, కళ్యాణ్, వినియోగదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేవీకి ఎంపికైన గడ్కోల్‌ యువకుడు



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామానికి చెందిన ఎంపెల్లి అనుదీప్‌గౌడ్‌ ఇండియన్‌ నేవీకి ఎంపికై నట్లు గ్రామస్తులు తెలిపారు. అనుదీప్‌గౌడ్‌ తల్లిదండ్రులు అశోక్‌గౌడ్‌ లావణ్య. అనుదీప్‌ ఇంటర్‌ ద్వితీయ సంవత్సరంలోనే పట్టుదలతో చదివి అగ్నివీర్‌లో నేవీకి ఎంపికయ్యాడు. ఈ నెల 5న వెలువడిన ఫలితాల్లో అనుదీప్‌గౌడ్‌ ఇండియన్‌ నేవీకి ఎంపికవ్వడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌డీఎస్‌ఎల్‌ కార్మికుల ముందస్తు అరెస్టు



బోధన్‌టౌన్‌(బోధన్‌): ఎన్‌డీఎస్‌ఎల్‌ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌ రెడ్డిని, మంత్రి శ్రీధర్‌ బాబును కలుద్దామని అనుకున్న తరుణంలో కార్మికులను పోలీసులు అరెస్టు చేశారన్నారు. అర్ధరాత్రి పోలీసులు కార్మికుల ఇంటికి వచ్చి అరెస్టు చేయడం సరికాదన్నారు. కుమార స్వామి, ఉపేందర్‌, రవిశంకర్‌గౌడ్‌, శ్రీనివాస్‌, మల్లేష్‌, బాల్‌ చందర్‌ అరెస్టయ్యారు. ఎన్‌డీఎస్‌ఎల్‌ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్‌, మాజీ కౌన్సిలర్‌ రామారాజు, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షులు రవిందర్‌ యాదవ్‌ అన్నారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన కార్మికులను వారు పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో కలిసి మాట్లాడారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ మంగళవారం తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురి నుంచి రూ. 5340 నగదు, నాలుగు ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పేరుకే పీహెచ్‌సీ.. సేవలు సున్నా

- సిబ్బంది కొరత, అరకొర వసతులు
- సాయంత్రం 6 గంటలకే ఆస్పత్రికి తాళం
- ఇబ్బంది పడుతున్న రోగులు.. పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పీహెచ్‌సీ భవనం



శిక్షణ కోసం నిర్మించిన భవనంలో వైద్య సేవలందిస్తున్న వైద్యుడు, సిబ్బంది

బోధన్‌: సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో వైద్య సేవలు అందడం లేదు. దీంతో ప్రభుత్వ వైద్యం కోసం వచ్చే పేదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం ఈ ఆరోగ్య కేంద్రానికి సాలూరతో పాటు మారుమూల గ్రామాలైన మందర్న, హున్సా, ఖాజాపూర్‌, తగ్గేల్లి, ఫత్తేపూర్‌, కుమ్మన్‌పల్లి, సాలూర క్యాంప్‌, కొప్పర్తి క్యాంప్‌, సాలంపాడ్‌ గ్రామాల నుంచి ప్రజలు వైద్య కోసం వంద మంది వరకు వస్తుంటారు.

శిథిలావస్థలో పాత భవనం

సాలూరలో 2000 సంవత్సరంలో పీహెచ్‌సీకి అధునాతన భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరింది. ఆరు నెలల క్రితం భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. ఈ కేంద్రం పక్కన వైద్య సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు నిర్మించిన కొత్త భవనంలో వైద్య సేవల కోసం మార్చారు. కొత్త భవనంలో విశాలంగా ఉన్న ఒకే గదిలోనే వైద్యుడు, సిబ్బంది, ఫార్మాసిస్ట్‌, ల్యాబ్‌ టెక్నీషియన్‌, ఇన్‌పేషంట్‌ రోగులకు సేవలందిస్తున్నారు. వైద్యుడితో పాటు ఇద్దరు స్టాఫ్‌ నర్సులు, మరో ఇద్దరు ఆయూష్‌ సిబ్బంది, ల్యాబ్‌ టెక్నీషియన్‌, మహిళా సూపర్‌వైజర్‌, మరో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. హెచ్‌ఈవో, సీహెచ్‌వో, పీహెచ్‌ఎన్‌ పోస్టులో ఉన్న ముగ్గురు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాకు వెళ్లి పని చేస్తున్నారు.

చెట్ల కిందే నిరీక్షణ

వైద్యం కోసం వచ్చే రోగులకు కనీసం కూర్చునేందుకు స్థలం లేక ఆరుబయట చెట్ల కిందే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 24 గంటల పనివేళల కేంద్రంగా ఉన్నప్పటికీ ఆస్పత్రికి వచ్చే రోగులు, వైద్యసిబ్బంది, భద్రతను దృష్టిలో పెట్టుకుని పనివేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కుదించారు. దీంతో రాత్రి వేళ వైద్యం అందించే అవకాశం లేకుండా పోయింది. సాయంత్రం 6 గంటలకే కేంద్రానికి తాళం వేస్తున్నారు. కొత్త భవన నిర్మాణం కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

కాన్పులన్నీ బోధన్‌ ఆస్పత్రికి రిఫర్‌

పీహెచ్‌సీకి కాన్పుల కోసం వచ్చే గర్భిణులను బోధన్‌ ప్రభుత్వాస్పత్రికి రిఫర్‌ చేస్తున్నారు. ఇక్కడ సాధారణ కాన్పులు చేసే సౌకర్యాలు లేవు. 104, 108 అంబులెన్స్‌ల సేవలను వైద్య సిబ్బంది వినియోగించుకుని కాన్పులకు రిఫర్‌ చేస్తున్నారు.

కలెక్టర్‌ ఆదేశించినా..

ఇటీవల పీహెచ్‌సీని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సందర్శించి తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. కానీ కొంత మంది సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. వాస్తవ పరిస్థితులను గుర్తించి జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



పీహెచ్‌సీలో రోగులకు వైద్య చికిత్సలు చేస్తున్న డాక్టర్‌ రాజ్‌కుమార్‌

సిబ్బంది కొరత ఉంది

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత, వసతి అసౌకర్యంతో ఇబ్బందులు వస్తున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం.

– రాజ్‌కుమార్‌, పీహెచ్‌సీ వైద్యుడు

అర్వింద్‌.. చర్చకు సిద్ధమా?

- నవోదయపై రాజకీయం తగదు
- రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: జిల్లాకు ఎంపీ అర్వింద్‌ చేసిందేమీ లేదని, కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేదని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రూరల్‌ ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ఎంపీ అర్వింద్‌ తీసుకొచ్చిన నిధులపై, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎంపీ అర్వింద్‌కు ఎమ్మెల్యే సవాల్‌ విసిరారు. జిల్లాకు నవోదయ పాఠశాల 2022లోనే వచ్చిందని నాటి ప్రభుత్వం, బీజేపీ నాయకులు పాఠశాలకు సంబంధించిన స్థలం చూయించకపోవడంతో తిరిగి వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుతం జక్రాన్‌పల్లి మండలంలో 39 ఎకరాల స్థలం చూశామని, దీనిని కాదని ఎంపీ అర్వింద్‌ కలిగోట్‌ శివారులో ఉన్న స్థలాన్ని చూయించారన్నారు. ఎంపీ చూసిన స్థలం నవోదయ విద్యాలయానికి అనుకూలంగా లేదని, మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. దీనిపై అర్వింద్‌ అనవసరంగా రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ సీఎంగా ఉన్నప్పుడు పేద, మధ్య తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని విద్యావ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీల్లో వైస్‌చాన్స్‌లర్లను నియమించారని గుర్తు చేశారు. జిల్లాకు మూడు ఇంటిగ్రేటెడ్‌ స్కూళ్లు మంజూరయ్యాయని అన్నారు. ఎంపీ అర్వింద్‌కు పసుపు రైతులపై సానుభూతి ఉంటే వెంటనే కేంద్రంతో మాట్లాడి క్వింటాలు పసుపునకు రూ. 25 వేలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, మునిపల్లి సాయి రెడ్డి, కొసరాజు రామకృష్ణ, నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

బోధన్‌రూరల్‌: పాడి రైతులు పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ జగ్నునాథచారి అన్నారు. పశుసంవర్ధక శాఖ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం బోధన్‌ పట్టణంలోని ఏకచక్రేశ్వర గోశాలలో పశువుల సంరక్షణ, వ్యాక్సిన్‌లు, మందుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గోశాలలోని దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. ఆవులకు గర్భకోశ చికిత్సలు చేశారు. పాడి రైతులు పాడి పశువులు, జీవాలకు తప్పనిసరిగా షెడ్యూలు ప్రకారం ప్రభుత్వం అందించే వ్యాక్సిన్‌లు, మందులు వేయించాలన్నారు. పశువులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే పశుసంవర్ధక శాఖ వైద్యులను సంప్రదించాలన్నారు. స్థానిక అధికారులు, సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్‌ ఏడీ రోహిత్‌రెడ్డి, సూపర్‌వైజర్‌ సాయి కిరణ్‌, బాలాజీ, మురారి, ఆరిఫ్‌, అజ్మత్‌, పోశెట్టి, వినోద్‌, జీవన్‌ తదతదితరులు పాల్గొన్నారు.



దూడలకు నట్టల నివారణ మందు వేస్తున్న అధికారులు

ఎల్‌ఆర్‌ఎస్‌కు విశేష స్పందన వస్తోంది

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి స్థాయి ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్‌ చేసుకునేందుకు చొరవ చూపుతున్నారని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 లోపు పూర్తి స్థాయి ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజుతో పాటు ప్రో–రాటా ఓపెన్‌ స్పేస్‌ చార్జీలను చెల్లించే వారికి ప్రభుత్వం 25 శాతం రిబేటు వర్తింపజేస్తోందని అన్నారు. దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని అన్నారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ, ల్యాండ్‌ రెగ్యులరైజెషన్‌కు సంబంధించిన ప్రొసీడింగ్‌లు జారీ చేయడం జరుగుతోందని వివరించారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో 190 మంది ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారని తెలిపారు. మంగళవారం ఒక్క రోజే 15 మంది దరఖాస్తుదారులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్‌ చేసుకున్నారని వివరించారు. భీంగల్‌ మున్సిపల్‌ 26 మంది, బోధన్‌లో 104 మంది ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజు చెల్లించారని తెలిపారు. నిజామాబాద్‌ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు 895 మంది ఫీజు చెల్లింపులు పూర్తి చేశారని, ఎల్‌ఆర్‌ఎస్‌ కింద రూ. 12.45 కోట్ల రుసుము వసూలైందని అన్నారు. మిగితా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువులోపు ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజు చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులలో 90 శాతం రిఫండ్‌ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్‌ చార్జెస్‌ కింద తీసుకుంటారని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్‌ జారీ చేస్తున్నామని అన్నారు. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన రిబేటు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 25 శాతం రాయితీ పొందాలని కలెక్టర్‌ సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ ఫీజు తగ్గింపుపై ప్రచారం

నిజామాబాద్‌ సిటీ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నారు. 2020లో ల్యాండ్‌ రెగ్యులేషన్‌ స్కీం కింద దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్‌ చేసుకున్న వారికి ఫీజులో 25 శాతం మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీంతో బల్దియా అధికారులు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. నిజామాబాద్‌ కార్పొరేషన్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం 36 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అసిస్టెంట్‌ సిటీ ప్లానింగ్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. దరఖాస్తుదారుల వివరాలను మూడు స్టేజీల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసిన తర్వాత అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌ స్కీం పొందిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎల్‌ఆర్‌ఎస్‌ ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన దృశ్యం

కాంగ్రెస్‌ ఎప్పటికీ రైతు పక్షపాతి

- పసుపు ధరల తగ్గుదలపై ఎంపీ అర్వింద్‌ సమాధానం ఇవ్వాలి
- రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: కాంగ్రెస్‌ పార్టీ ఎప్పటికీ రైతు పక్షపాతిగానే ఉంటుందని, పసుపు రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో మంగళవారం ఆయన నుడా చైర్మన్‌ కేశవేణుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మానాల మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిరాశపరిచాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓటమిపై సమీక్షించి రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఇటీవల జిల్లాలోని పసుపు రైతులు ధర తగ్గుదలపై ఆందోళనచెందుతున్నారని, వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. ప్రత్యేక అధికారిని త్వరలోనేనియమించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. పసుపు ధరలు పెరిగితే అది తమ గొప్పదనమని చెప్పుకునే ఎంపీ అర్వింద్‌, ధరల తగ్గుదలకు బాధ్యత వహించరా? అని ప్రశ్నించారు. బోర్డు చైర్మన్‌ పసుపురైతుల గోసను ఒక్కసారి అయినా పట్టించుకున్నారా అని ధ్వజమెత్తారు. పసుపు రైతులు ఎండిన పసుపును మార్కెట్‌కు తీసుకువచ్చి మంచి ధర పొందాలని కోరారు. నాయకులు నరాల రత్నాకర్‌, నరేందర్‌గౌడ్‌, సేవాదల్‌ సంతోష్‌, గోపి, వేణు రాజ్‌, బింగి శుభం, సాయి కిరణ్‌, కౌశిక్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

విద్యుత్‌ షాక్‌తో రైతు మృతి



రాజంపేట: విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెట్టిగాడి రాంచంద్రం(61) మంగళవారం ఉదయం 6.30 గంటలకు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో నీరు పారించేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా బోరు మోటార్‌ వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. స్టాటర్‌ డబ్బాలో విద్యుత్‌ వైరు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు

నందిపేట్‌: దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు నందిపేట్‌ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నందిపేట్‌ మండలం వెల్మల్‌కు చెందిన కుస్తాపురం శ్రీనివాస్‌ తన భార్య, తండ్రితో కలిసి వ్యవసాయ పనుల కోసం పంట పొలాలకు వెళ్లాడు. ఇంటి వద్దే ఉన్న తల్లి భోజమ్మ ఉదయం 11 గంటలకు బీడీల ఖార్కానాకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చే సరికి ఇంటి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రెండు తులాల బంగారు నగలు, పది తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కాగా ఇంటి పక్కనే ఉన్న సీసీ పుటేజీల్లో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడి పారిపోతున్నట్లు రికార్డు అయ్యింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఎడపల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లి వద్ద నిందితుడు శ్రీనివాస్‌ను పోలీసులు పట్టుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుకున్న నిందితుడి నుంచి పది తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నిజాంసాగర్‌: మండలంలోని అచ్చంపేట శివారులో ఉన్న నల్ల వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్‌ మంగళవారం తెలిపారు. నల్లవాగులో ఉన్న ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

లక్కోరలో ఒకరి అదృశ్యం

వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం లక్కోర గ్రామానికి చెందిన గడ్డం నరేశ్‌ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ మంగళవారం తెలిపారు. స్థానికంగా టిఫిన్‌ సెంటర్‌ నిర్వహించే నరేశ్‌కు సోమవారం దోశ ఆర్డర్‌ వచ్చింది. డెలివరి చేసి వస్తానని భార్య లాస్యకు చెప్పి బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడం, ఫోన్‌ చేసినా స్విచ్ఛాఫ్‌ రావడంతో మంగళవారం సాయంత్రం లాస్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జంగంపల్లిలో మద్యం సీజ్‌



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన కందునూరి నరేశ్‌గౌడ్‌ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై డి ఆంజనేయులు మంగళవారం తెలిపారు. 24 లీటర్ల మద్యాన్ని సీజ్‌ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య



శరత్‌ కుమార్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: కడుపునొప్పి భరించలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం గర్గుల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పల్లపు రాంబాబు మేస్త్రీ పని చేస్తున్నాడు. రాంబాబు దంపతులకు కుమార్తె మాధవి, కుమారుడు శరత్‌ కుమార్‌(16) ఉన్నారు. మాధవి కామారెడ్డిలో ఇంటర్‌, శరత్‌ కుమార్‌ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రోజూ మాదిరిగానే ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు. మాధవి ఇంటర్‌ పరీక్ష రాసి మధ్యాహ్నం ఇంటికి రాగా శరత్‌ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా అతడు కడుపునొప్పితో బాధపడుతున్నాడని అందుకే ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

క్రికెట్‌ అంటే ప్రాణం..

ఆత్మహత్యకు పాల్పడిన శరత్‌కుమార్‌కు క్రికెట్‌ అంటే ప్రాణం. ఎక్కడ టోర్నమెంట్‌ జరిగినా వెళ్లి ఆడేవాడు. విరాట్‌ కోహ్లీకి వీరాభిమాని అని స్థానికులు తెలిపారు. బ్యాటింగ్‌లో చక్కని ప్రతిభ కనబరిచేవాడు. జిల్లా స్థాయి టోర్నీల్లో పాల్గొని అనేక అవార్డులు సొంతం చేసుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అండర్‌–16 రాష్ట్ర స్థాయి క్రికెట్‌ టోర్నీలో జిల్లా జట్టు తరఫున ఆడి చక్కని ప్రతిభ కనబరిచాడు. శరత్‌ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ విధించినట్లు ఐదో టౌన్‌ ఎస్సై గంగాధర్‌ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఐదో టౌన్‌పీఎస్‌ పరిధిలో డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపడుతుండగా శివాజీనగర్‌కు చెందిన సూర్యభీమ్‌రావు మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

జానకంపేటలో మరొకరికి..

ఎడపల్లి: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తి రెండు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్‌ శేష తల్ప సాయి విధించినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఎడపల్లి మండలం జానకంపేటలో సోమవారం నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీల్లో పట్టుబడ్డ షేక్‌ అమీర్‌ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుద్దులంలో విషాద ఛాయలు

- అధికార లాంఛనాలతో సిరిసిల్ల 17వ బెటాలియన్‌ కమాండెంట్‌ అంత్యక్రియలు



కమాండెంట్‌ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర అడిషనల్‌ డీజీ సంజయ్‌ జైన్‌

కోటగిరి: సిరిసిల్ల జిల్లాలో 17వ బెటాలియన్‌కు చెందిన పోలీస్‌ కమాండెంట్‌ తోట గంగారాం(55) మృతితో కోటగిరి మండలం సుద్దులంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి లిఫ్ట్‌ నుంచి కింద పడిపోవడంతో మృతి చెందాడు. గంగారాం స్వగ్రామం కోటగిరి మండలం సుద్దులం కావడంతో కుటుంబీకులు, బంధువులు, మిత్రులు స్వగ్రామానికి మంగళవారం సాయంత్రం తీసుకొచ్చారు. రాష్ట్ర అడిషనల్‌ డీజీ సంజయ్‌ జైన్‌ గంగారాం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాలిలో కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పోలీస్‌ శాఖకు చెందిన పలువురు అంత్యక్రియలకు హాజరయ్యారు.

పీఎస్‌లో నిందితుడితో ఊడ్పించిన పోలీసులు

బోధన్‌టౌన్‌: బైక్‌ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తితో స్థానిక పీఎస్‌లో పనులు చేయించిన ఘటన బోధన్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఓ బైక్‌ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న సదరు వ్యక్తిని సోమవారం రాత్రి విచారణ నిమిత్తం పీఎస్‌కు తీసుకొచ్చారు. కాగా నిందితుడు మంగళవారం ఉదయం పీఎస్‌లో చీపురుతో ఊడుస్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై సీఐ వెంకట నారాయణ వివరణ కోరగా బైక్‌ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని రాత్రి పీఎస్‌కు తీసుకొచ్చామని, నిందితుడు కింద పడుకోవడం కోసం ఊడ్చాడని అన్నారు. తమ సిబ్బంది చీపురుతో శుభ్రం చేయాలని చెప్పలేదని అన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

మాచారెడ్డి: మండల కేంద్రానికి చెందిన గుండ్లపల్లి నాగరాజు అనే యువకుడు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. స్థానికంగా టీవీ రిపేర్‌ చేస్తూ జీవనం సాగించే నాగరాజు ఛాతిలో నొప్పంటూ కుప్పకూలిపోగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట: బాలికకు మాయమాటలు చెప్పి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలం ఓ గ్రామానికి చెందిన బాలికకు లింగంపల్లికలాన్‌ గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. అతని మాయమాటలు నమ్మిన బాలికను యువకుడు మోసం చేశాడు. యువకుడిని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్‌ సమక్షంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాగులో పడి ఒకరి మృతి

ఎడపల్లి: ఒడ్డు నుంచి చేపలు పడుతున్న ఓ వ్యక్తి నీటిలో పడి మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలం అంబం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తల ఒడ్డెన్న(49) గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వాగు ఒడ్డు నుంచి చేపలు పడుతున్న అతను కాలు జారి నీటిలో మునిగి మృతి చెందాడు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నిజామాబాద్‌ రూరల్‌: మోపాల్‌ మండలంలోని న్యాల్‌కల్‌ గ్రామ చెరువులో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వయస్సు 33–35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఎరుపు రంగు చెక్స్‌ గల షర్ట్‌, నలుపు రంగు ప్యాంట్‌, స్వెటర్‌ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659850 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.